రాజకీయ కార్యక్రమాలకు అనుమతులు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఆర్వో రవీందర్



పర్చూరులో మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్లు



అన్నంబొట్లవారిపాలెంలో మాట్లాడుతున్న ఏఆర్‌ఓ సుబ్బయ్య

పర్చూరు (చినగంజాం): రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎటువంటి అనుమతులు లేకుండా కార్యక్రమాలు నిర్వహించరాదని పర్చూరు రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జీ రవీందర్ అన్నారు. శనివారం పర్చూరు నియోజకవర్గంలోని రాజకీయ నాయకులు, ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మార్చి 16వ తేదీ నుంచి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలులో ఉందన్నారు. పార్టీ కార్యాలయాలు, సభలు, సమావేశాలు, ర్యాలీలు, కరపత్రాలు పంపిణీ ఇలాంటి ప్రతి విషయాలకు అభ్యర్థులు పార్టీలు అనుమతి తీసుకొని చేయాలన్నారు. ఈఅనుమతులకు వివిధ యాప్ ద్వారా గాని పర్చూరు ఆర్‌ఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సింగిల్ విండో సిస్టం ద్వారా 24 గంటల్లోనే అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రతి పార్టీ కూడా తూ.చ తప్పకుండా ఎన్నికల నియమావళి పాటించాలని కోరారు. అందుకు ప్రతి పార్టీ రాజకీయ పార్టీ, అభ్యర్థులు సహకరించాలని తెలిపారు. ఈ సమావేశంలో పర్చూరు ఏఆర్‌ఓ సీహెచ్ సుబ్బయ్య, ఇంకొల్లు ఏఆర్‌ఓ ఎం ప్రమీల, వివిధ అధికారులు, రాజకీయ పార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

☛ ప్రతి ఓటరూ చైతన్యవంతంగా ఓటు వేయాలని.. ఓటు వేయడం ఒక బాధ్యత అని పర్చూరు ఏఆర్‌ఓ, తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు. మండలంలోని అన్నంబొట్లవారిపాలెం గ్రామంలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి ఏ రాణి, ఆర్ఐ ప్రేమ్‌కుమార్, వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు తదితరులు హాజరయ్యారు. గ్రామంలోని ఓటర్లు పాల్గొన్నారు.

☛ పోలింగ్ అధికారులు ఎన్నికల నిర్వాహణ విషయమై పూర్తిస్థాయి శిక్షణ పొంది ఉండాలని నియోజక వర్గం ఎన్నికల మాస్టర్ ట్రైనర్, చినగంజాం తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్ర అన్నారు. శనివారం పర్చూరు క్రీడా వికాస కేంద్రంలో నిర్వహించిన పోలింగ్ నిర్వాహణకు సంబంధించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన అవగాహన కల్పించారు. మాస్టర్ ట్రైనర్, సెక్టార్ అధికారులు, పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు ఈవీఎం, వీవీప్యాట్, సీయూ, బీయూల పనివిధానం, పోలింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమంలో పర్చూరు ఏఆర్‌ఓ సీహెచ్ సుబ్బయ్య, యద్దనపూడి ఏఆర్‌ఓ నాగరాజు, చినగంజాం ఏఆర్‌ఓ జీవీఎస్ ఫణీంద్రబాబు, మార్టూరు ఏఆర్‌ఓ కే సంధ్యశ్రీ, కారంచేడు ఏఆర్‌ఓ మెహర్ బాబు, మాస్టర్ ట్రైనర్స్ ఈ రాజశేఖర్, రాఘవరెడ్డి, దేవేందర్, ఏఎస్‌ఓ శ్రీమన్నారాయణ, 38 మంది సెక్టార్ అధికారులు, 18 మంది మాస్టర్ ట్రైనర్లు హాజరయ్యారు.

క్లుప్తంగా

చంద్రబాబు వ్యాఖ్యలు హేయమైనవి



బాబురావు

చినగంజాం: అసెంబ్లీకి ఒక సామాన్య దళితుడిని ఎంపిక చేసి పంపాలనుకోవడం సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి పరిపూర్ణ వ్యక్తిత్వానికి నిదర్శనమని, వృత్తి పరంగా డ్రైవర్‌గా ఉన్న వ్యక్తిని చంద్రబాబు నాయుడు బహిరంగంగా అవహేళన చేయడం సమంజసం కాదని బాపట్ల జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాటుకూరి బాబురావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టిప్పర్ డ్రైవర్‌ను అసెంబ్లీకి పంపాలని చూడటం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తప్పా అన్నార. చంద్రబాబు నాయడులా కోట్ల రూపాయిలు తీసుకొని ధనికులను చట్ట సభలకు పంపాలా అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

పాలీసెట్ ఎంట్రన్స్‌కు ఉచిత శిక్షణ

అద్దంకి రూరల్: అద్దంకి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 27వ జరగబోయే పాలీసెట్ ఎంట్రన్స్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకుచ్చే విద్యార్థులకు ఉచిత మెటీరియల్ అందజేయనున్నట్లు తెలిపారు. ఇంకా పాలీసెట్‌కు దరఖాస్తు చేసుకోని విద్యార్థులు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా కళాశాలలో దరఖాస్తు చేసుకోచ్చన్నారు. వివరాలకు 99491 41277, 97055 18378 నంబర్లను సంప్రదించాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చిన్నగంజాం–ఉప్పుగుండూరు రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య వివరాల మేరకు.. చినగంజాం రాజుబంగారుపాలెం గ్రామ సమీపంలో వ్యక్తి ఎగువలైన్‌పై పడిఉన్నాడనే సమాచారంతో సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. వృద్ధుడి మృత దేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. మృతుడి వయస్సు సుమారుగా 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందని, మృతుడు 5.8 అడుగల ఎత్తు, ఎరుపుఛాయ, నలుపు వెంట్రుకలు కలిగి ఉన్నాడని, వీపు మధ్యలో పుట్టుమచ్చ ఉన్నదని ఎస్సై తెలిపారు. మృతుని శరీరంపై తెలుపు రంగు, నిలువు నల్లగీతలు కలిగిన నిండుచేతులు చొక్కా, నీలం రంగు జర్కిన్, నీలం రంగు లోయర్ ఉన్నట్లు చెప్పారు. అయితే రైలు ప్రమాదంలో వ్యక్తి ముఖం ఛిద్రమై గుర్తుపట్టలేని విధంగా ఉన్నదని ఎస్సై తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుని సమాచారం ఎవరికైన తెలిసినట్లయితే జీఆర్పీ ఎస్సై 94406 27646 నబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంపై కేసు

బల్లికురవ: బైకుపై వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వస్తున్న వాహనం తగలటంతో తల్లి, కుమారుడు గాయాలపాలయ్యారు. ఈఘటన గురువారం జరగ్గా వైద్యశాల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్టేషన్ రైటర్ ఆంజనేయులు తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన మీర్ల వేణుగోపాలరెడ్డి ఆయన తల్లి కోటేశ్వరమ్మతో గురువారం బైకుపై అద్దంకి వచ్చి నరసరావుపేట వెళ్తుండగా మండలంలోని కొప్పరపాడు గ్రామీపంలో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను స్థానికులు చికిత్సకై నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఫిర్యాదు చేశారు. కేసు నమోదుతో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఆంజనేయులు వివరించారు.

రేపు ఇఫ్తార్ విందు

మార్టూరు: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మండల కేంద్రం మార్టూరులో ఏప్రిల్ 1వ తేదీ సోమవారం సాయంత్రం ముస్లింలకు పర్చూరు వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయనున్నట్లు పర్చూరు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. స్థానిక గన్నవరం రోడ్డులోని మసీదు సమీపంలో సోమవారం రాత్రి 7 గంటలకు నిర్వహించనున్న ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

ప్రతి కార్యకర్తకూ అండగా వైఎస్సార్ సీపీ



కార్యకర్తలతో మాట్లాడుతున్న యడం బాలాజీ

● వైఎస్సార్ సీపీ పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి బాలాజీ

ఆదిపూడి (కారంచేడు): గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ జెండాను మోసే ప్రతి కార్యకర్తకు ఆ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీ అన్నారు. శనివారం రాత్రి ఆయన మండలంలోని ఆదిపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కార్యక్రమాల్లోను, పార్టీ కార్యకర్తలుగా అనేక సేవలందించిన అనేక మంది ఉన్నారన్నారు. వారందరికీ పార్టీ ఎల్లప్పుడు అండగానే ఉంటుందన్నారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్త నా కుటుంబమేనన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. రాబోయే ఎన్నికల్లో జగనన్న సుపరిపాలన ప్రజలకు అందించేలా ప్రతి ఒక్కరం కష్టపడి పనిచేద్దామని ఆయన పిలుపునిచ్చారు. జగనన్న పేద ప్రజలకు సంక్షేమం కోసం చేసిన అనేక సంస్కరణలో ప్రజల హృదయాల్లో నిలచిపోయాయన్నారు. గ్రామంలో నారిశెట్టి పాపానాయుడు అనారోగ్యంతో ఉంటే ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, మాజీ వైస్ ఎంపీపీ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు చల్లా సుబ్బారెడ్డి, గోగినేని బుల్లెబ్బాయి, కే సామ్యేలు, కోట హరిబాబు, యద్దనపూడి హరిప్రసాద్, శ్రీరామరెడ్డి, యర్రంశెట్టి రాంబాబు, బండారు కృష్ణ, పట్టయ్య, రఘురామయ్య, కే దాసు, అంకోలు, సుదీర్‌కుమార్, శిఖామణి, నగేష్, కోటేశ్వరరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నరసింహారెడ్డి

మేదరమెట్ల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలనకు ఆకర్షితులైన కొరిశపాడు గ్రామానికి చెందిన పీ. నర్సారెడ్డి, గోలి రమణబాబు, రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో పలు కుటుంబాలు వైఎస్సార్ సీపీ నాయకుడు పానెం నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరందరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం హనిమిరెడ్డి గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి కావూరి శేషశర్మ, నాయకులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ఇంటింటా సంతోషం..



ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకుడు నరసింహారెడ్డి

అద్దంకి రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటా సంతోషంగా ఉన్నారని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి సోదరుడు వైఎస్సార్ సీపీ నాయకుడు పానెం నరసింహారెడ్డి అన్నారు. శనివారం స్థానిక 12 వవార్డులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిని సందర్శించి జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అద్దంకి ఎమ్మెల్యేగా హనిమిరెడ్డిని. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్‌లు పట్టణ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన బార్ అసోసియేషన్ ఎన్నికలు



ఎన్నికైన నూతన ప్రతినిధులు

చీరాల రూరల్: చీరాల బార్ అసోసియేషన్ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. అసోసియేషన్ అధ్యక్షుడిగా గౌరవ రమేష్‌బాబు రెండవసారి ఎన్నికయ్యాడు. శనివారం ఉదయం 11 గంటలకు బార్ అసోసియేషన్ హాలులోప్రారంభమైన ఎన్నికలు సాయంత్రం నాలుగు గంటలకు ముగిశాయి. కౌంటింగ్ ప్రారంభించిన ఎన్నికల అధికారులు విజేతలను ప్రకటించారు. అధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచిన గౌరవ రమేష్‌బాబు 49 ఓట్ల మెజార్టీతో గెలుపొందాడు. అలానే జనరల్ సెక్రటరీగా స్థానానికి బరిలో నిలిచిన కొటిక ఉదయ భాస్కరరావు 11 ఓట్ల మెజార్టీగా గెలుపొందారు. ఉపాధ్యక్ష పదవికి బోయిన శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరి ఆలూరి మణినాగ శయన, లైబ్రరి సెక్రటరి సిరిపురం కామేశ్వరరావు, కోశాధికారిగా నాశన రామ కోటేశ్వరరావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెకటరిగా ఎ. రాజా సాల్మన్‌లు ఒక్కొక్క నామినేషన్ వేయడంతో ఎన్నికలు లేకుండా ఏకగ్రీకంగా ఎన్నికయ్యారు. మహిళా ప్రతినిధి పోస్టు కోసం ఒక నామినేషన్ వేశారు. నామినేషన్ పత్రం అసంపూర్తిగా ఉండడంతో ఇన్‌వాలిడ్‌గా ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఎన్నికల అధికారులుగా కరేటి రవికుమార్ రెడ్డి, ఆసాది సత్యనారాయణ రెడ్డి, బోయిన రమేష్‌బాబులు వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ ప్రతినిధులను న్యాయవాదులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.

చేపపిల్లల వాహనం బోల్తా

మేదరమెట్ల: చేప పిల్లల లోడుతో వెళ్తున్న ఆటో బోల్తా పడింది. ఒంగోలు వైపు నుంచి పిడుగురాళ్లకు చేప పిల్లల లోడుతో వెళ్తున్న ఆటో కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల దక్షిణ బైపాస్ సమీపంలో శనివారం బోల్తా పడింది. డ్రైవర్ ఫోన్ మాట్లాడుతూ వాహనాన్ని నడపడంతో అదుపు తప్పిన ఆటో రోడ్డు మార్జిన్‌లో బోల్తాపడింది. దీంతో ఆటోలో ఉన్న చేపపిల్లల బాక్సులు రోడ్డుపై పడిపోయాయి. మరో వాహనాన్ని పిలిపించుకొని బాక్సులను గమ్యస్థానానికి చేర్చారు. ఈప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

రేపు ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ

చీరాల అర్బన్: చీరాల పట్టణంలో వెసో ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఉచిత పాలిటెక్నిక్, ఎంసెట్, ఈసెట్ కోచింగ్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆర్గనైజేషన్ అధ్యక్షులు అవ్వారు ముసలయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత 17 ఏళ్లుగా అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాల పేద విద్యార్థులకు ఉచిత కోచింగ్‌ను అందిస్తూ ఇప్పటికి 3500 మంది విద్యార్థులను చదివించామన్నారు. ఆదివారం చీరాల తెల్ల గాంధీ బొమ్మ వద్ద ఉన్న కోచింగ్ సెంటర్ వద్దకు వచ్చి అడ్మిషన్ పొందాలన్నారు.

వెంకటేష్ గెలుపునకు మావంతు సహకారం



కరణం వెంకటేష్‌ను పూలమాలతో సత్కరిస్తున్న దివ్యాంగులు

చీరాల: నియోజకవర్గంలో ప్రజలకు, దివ్యాంగులకు ఎన్నో సేవలందించి అభివృద్ధి పథంలో ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి నడిపిస్తున్నారన్నారు. శనివారం ఈపూరుపాలెంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షులు చల్లా రామయ్య, దివ్యాంగుల నాయకులు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్‌ను గజమాలతో సత్కరించారు. చీరాల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిస్తున్నారన్నారు. చీరాల ప్రజలు, దివ్యాంగుల కుటుంబాలు అన్ని కలిసి రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే కరణం వెంకటేష్‌ను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అలానే బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌ను రెండోసారి ఎంపీగా గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో చీరాల దివ్యాంగుల నాయకులకు సయ్యద్ సలీమ్, దాసరి అశోక్, బ్రిటా బ్రహ్మయ్య, షేక్ కరీమూన్, ఐ.నాగేశ్వరరావు, అంజలి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.